# కథకుడి కథ

నేను కథకుణ్ణయిన మాట నిజమేకానీ - పుంఖాను పుంఖంగా కథలు రాయటం మటుకు నాచేతకాదు. ఎంచేతనంటే-బహుశా నా దుర దృష్ట మనుకుంటాను. కథా వస్తువులు నాకు దొరకవు. నన్ను బాగా కదిలించిన సంఘనలనే-ఇతివృత్తంగా తీసుకోవడం, వాటిని కథలుగా మలచడం నాకో అలవాటు. అడపా దడపా తగిలిన అట్లాంటి సంఘటనలనే కథలుగా రాశాను. చాలా రోజులుగా ఈ మధ్యనేను ఏ కథా రాయలేదు.

ఉన్నట్టుండి ఒక ఉదయంపూట, ఒక చక్కని కథరాయాలన్న ఊహకలిగింది. ఊహ కలిగిందీ అంటే-ఉట్టిపాటుగా కలిగిన ఊహ మట్టుకుకాదు. దాని వెనుక ఒక పెద్దకథే ఉన్నది. ఇంతకీ కథ రాయాలన్న ఊహ కలగడానికి నన్ను ప్రేరేపించిన సంఘటనని గురించి చెబుతాను.

ఆ ఉదయం మా ఆవిడ కొంచెం స్ట్రాంగ్ కాఫీ తయారు చేసింది. ఆ కాఫీ తాగి, తృప్తిగా సిగరెట్ పీలుస్తున్నాను. మా ఆవిడ వంటింట్లో ఏదో పనిచేసుకుంటోంది. పిల్లలంతా-మార్నింగ్ స్కూలు గనక అప్పుడే స్కూలుకు వెళ్ళారు. పెద్దపిల్ల - సరళ మట్టుకు ఏదో వారపత్రిక చూస్తోంది. ఉన్నట్టుండి నా దృష్టి దాని మీద పడింది.

ఎంతసేపు చూచినా అది పేజీ తిప్పకుండా, తదేకంగా పుస్త కంలోకి చూస్తున్నది అంటే, అది పత్రిక చదవడంలేదన్నమాట! ఏదో ఆలోచిస్తోంది. దానిముఖం కాస్త పరిశీలించి చూచాను. ఏదో అనిర్వచనీయమైన ఆనందరేఖలు దాని మొగంమీద దోబూచులాడు తున్నయ్.

నా మనసు కొంచెం ఉద్విగ్నమయిపోయింది. అది పెళ్ళీడు కొచ్చిన పిల్ల. పత్రికలో ఏ ప్రేమకథో తగిలివుంటుంది. అది చదివి-మధురోహాలలో మునిగిపోయి వుంటుంది.

వయసులోవున్న పిల్లలకు-తియ్యటి ఊహాలు తప్ప గత్యంతరంలేదు!

ఉన్నట్టుండి నా ఊహాలు మరో సంఘటన మీదకు పరుగులు తీసాయి. అది మూడురోజుల నాడు జరిగిన పెళ్ళి చూపుల సంఘటన. అంతా సవ్యంగా జరిగివుంటే సరళ పెళ్ళి ఈ పాటికి ఖాయపడాల్సింది. అబ్బాయి లక్షణంగా ఉన్నాడు. డిగ్రీ, డబ్బూ, వుద్యోగం అన్ని విధాలా ఒప్పినవాడే. సరళ కూడా వాళ్ళకి నచ్చింది. వచ్చిన మడత పేచీ అల్లా డబ్బుదగ్గరే! వాళ్ల కోరిన హిరణ్యాక్షవరాలకు నేను తలూపలేకపోయాను. దాంతో ఆ సంబంధం కాస్తా తప్పిపోయింది.

ఈ విషయం జ్ఞాపకం రావడంతోటే - మానుతున్న గాయం మీద కారప్పొడి చల్లినట్లయింది. నేటి యువతరంమీద ఎక్కడలేని మంటా పుట్టుకొచ్చింది. వీళ్ల వట్టి ఉత్తరకుమారులు! దేబెలు! వాజమ్మలు! వీళ్ళకి కట్నమే కైలాసం. వీళ్ళకి సౌందర్యారాధన లేదు. అభ్యుదయ భావాలు అంతకీలేవు. ఇట్లాంటి యువతరంతో దేశం ఏం ముందుకుపోతుంది?

నిజంగానే నేను చాలా ఉద్రేకపడిపొయ్యాను. సరళ ఎదురుగ్గా ఉండటంతో ఆ ఉద్రేకం ఉపశమనంపొందే దారికూడా లేకపోయింది. సరళను చూస్తూంటే-నా మనసు ద్రవీభూతమైపోయింది. నిజంగా మా సరళది కుంచెకూ, కలానికీ-అందని అందం. కుందనపు బొమ్మ! కట్టులో, బొట్టులో కూడా కొట్టవచ్చినట్టగపడే ప్రత్యేకత.

ఇట్లాంటి సౌందర్యరాశిని-డబ్బుకోసం కాలదన్నే యువకుల్ని చూస్తే - ఏ తండ్రి హృదయం మాత్రం క్షమిస్తుంది! నాలో రేగిన ఉద్రేకం, ఉద్వేగం ఎంతకీ చల్లారలేదు. పైపెచ్చు - ఆ ఉద్రేకం

లోనే ఒక మంచి కథ రాయాలన్న ఊహ తట్టింది. నిజమే ఈ యువతరాన్ని చీల్చి చెండాడుతూ కథ రాయాలి! అందులో ఆడ పిల్లల్ని కన్నతండ్రుల బాధలూ - ఆడపిల్లల అంతరాంతరాలూ - అన్నీ సున్నితంగా కళ్ళకు కట్టినట్లు చిత్రించాలి. సాహిత్య ప్రయో జనం ఇంతకన్నా ఏంవుంటుంది?

ఈ ఊహ నాలో మొలచిన తర్వాత ఒక్కచోట కూర్చోలేక పొయ్యాను. కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరిగాను. నాలో పదునైన భావాలు ఉవ్వెత్తుగా పొంగి పొర్లుతున్నాయి. వాటిని వెంటనే కాగితం మీదికి దించాలి.

"అమ్మాయ్ సరళా!"

అది ఈ లోకంలోకి వచ్చి, "పిల్చారా నాన్నా!" అంది.

"అవునమ్మా, కాగితాలూ, పెన్నూ కాస్త టేబుల్ మీద పెట్టమ్మా!" అన్నాను.

వెంటనే అది అన్నీ సిద్ధంచేసింది. సిగరెట్ పెట్టే, అగ్గిపెట్టె కూడా తెచ్చిపెట్టింది.

రాయడానికి మొదలు పెట్టేసరికి కాఫీతో ప్రత్యక్షమైంది. అది ఇంగితమెరిగినపిల్ల! నా అవసరాలేమిటో దానికి నేను చెప్ప నవసరంలేదు. అన్నీ ఇట్టే గ్రహిస్తుంది.

నేను కాఫీ చప్పరిస్తున్నాను.

"నాన్న మీతో ఒక విషయం చెప్పాలి" అన్నది సరళ.

నేను తల పైకెత్తి దాని ముఖంలోకి చూచాను. తలొంచుకొని, బొటనవ్రేలు నేలకి రాస్తోంది. ఏదో చెప్పడానికి సంశయిస్తోంది.

"చెప్పమ్మా ఫర్వాలేదు" అన్నాను మృదువుగా.

అతికష్టంమీద గొంతు పెగల్చింది.

"నాపెళ్ళి విషయం నాన్నా...." దానినోటికి బ్రేకు పడింది. నేను కొంచెం అయోమయంలో పడి "స్పష్టంగా చెప్పమ్మా, ఫర్వా లేదు" అన్నాను.

అది ధైర్యం పుంజుకుంది. "ఏంలేదు నాన్నా, మా ఆఫీసులో జాకబ్ అని ఒక అబ్బాయి ఉన్నాడు. మేమిద్దరం ప్రేమించుకున్నాం, మీరు అంగీకరిస్తే!"

నా తలతిరిగిపోయింది, జా క బ్ అంటే క్రిష్టియన్ అయి వుంటాడు. ఇంత బ్రతుకూ బ్రతికి-తన కూతుర్ని ఒక హీనకులస్తుడికి కట్టబెట్టడమా! తన పరువు ఏంకాను? ఎంతకు తెగించింది సరళ!

నాలో కోపం కట్టలు తెంచుకుంది. లేచి సరళ చెంపమీద లాగి కొట్టాను. చాలా బలంగానేకొట్టాను. ఆ దెబ్బకు-సరళ కెవ్వున కేకేసింది. ఆ కేకకు-ఇంట్లోంచి-మా ఆవిడ పరుగెత్తుకొచ్చింది. ఉట్టి పాటుగాలేచిన ఈ తుఫాను-దానికి అర్థంకాలేదు. దాని కళ్ళపడ్డదల్లా వాతలు తేలిన సరళ చెంప.

"ఏమిటండీ ఆ దారుణం?" అన్నది.

దాని నోటినుంచి మాట పూర్తికాలేదు. మరోదెబ్బ మాఆవిడకు అంటించేను. దాంతో అది భయపడిపోయి ఏడుస్తూ కూచుంది; అట్లా ఏడుస్తూ కూచున్న తల్లీ కూతుళ్ళను చూడడానికి నాకు మనస్కరించ లేదు.

చరచర బయటకు నడిచాను.

---